
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 32.0 కనిష్ఠం : 21.0
ANDHRAJYOTHY
5
నాగర్‌కర్నూల్
జిల్లా వార్తలు
సోమవారం 12 ఫిబ్రవరి 2024





ఇసుక తవ్వడంతో ఒట్టిపోయిన వాగు

పాలమూరు పుర పీఠం ఎవరి చేతికో?

- నేడే చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక
- అధ్యక్ష పదవి కోసం ఆనంద్ గౌడ్ వర్సెస్ వనజ
- ఆనంద్‌గౌడ్ ఎన్నిక లాంఛనమే!
- నేడే ప్రమాణ స్వీకారం
- వైస్ చైర్మన్ పదవి కోసమే తీవ్ర పోటీ
- అవకాశం కోసం ఎదురు చూస్తున్న బీఆర్ఎస్
- క్యాంప్‌లో కాంగ్రెస్ మద్దతుదారులు.. నేడు నేరుగా మునిసిపాలిటీకి



మహబూబ్‌నగర్ మునిసిపల్ కార్యాలయం



మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 11 : పాలమూరు పురపాలికను దక్కించుకునేందుకు అధికార, విపక్ష పార్టీల నాయకులు ఎవరికి వారు ప్రయత్నాలు చేస్తున్నారు. పీఠాన్ని హస్తగతం చేసుకునేందుకు అధికార పార్టీ మెజారిటీ కౌన్సిలర్ల మద్దతుతో ధీమాలో ఉండగా, తమ స్థానాన్ని తిరిగి దక్కించుకోవాలని బీఆర్ఎస్ ప్రయత్నాలు చేస్తోంది. జనవరి 27న మునిసిపల్ చైర్మన్ కోరమోని నర్సింహులు, వైస్ చైర్మన్ తాటి గణేష్‌లపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గిన సంగతి తెలిసింది. అవిశ్వాసానికి అనుకూలంగా 36 మంది సభ్యులు మద్దతు పలకడంతో చైర్మన్ ఎన్నిక కూడా లాంచనమేనని స్పష్టమవుతోంది. కొత్త చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక కోసం కలెక్టర్ సోమవారం నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. నేడు 11 గంటలకు మునిసిపల్ సమావేశ మందిరంలో కలెక్టర్ సమక్షంలో ఎన్నిక జరుగనుంది. మునిసిపాలిటీలో 49 మంది సభ్యులతోపాటు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి ఎక్స్‌అఫీషియో ఓటు ఉన్నందున మొత్తం 50 ఓట్లు ఉన్నాయి. ఇందులో హాజరైన వారిలో సగం మంది ప్లస్ ఒకరు మద్దతు ఇస్తే చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక జరుగుతుంది. అవిశ్వాసానికి గైర్హాజరైన బీఆర్ఎస్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు హాజరుకానుంది.

వైస్ చైర్మన్ కోసం హోరాహోరీ

కాంగ్రెస్ పార్టీ చైర్మన్ అభ్యర్థిగా 21వ వార్డు కౌన్సిలర్ ఆనంద్‌కుమార్ గౌడ్‌ను నిర్ణయించగా, బీఆర్ఎస్ మాత్రం చైర్‌పర్సన్‌గా కోరమోని వనజ, వైస్ చైర్మన్‌గా అనంతరెడ్డి పేర్లు ప్రకటించింది. ఇప్పటికే బీఆర్ఎస్ వీరికి మద్దతు పలకాలని పార్టీ గుర్తుపై గెలుపొందిన కౌన్సిలర్‌లకు విప్ జారీ చేసింది. అయితే కాంగ్రెస్, కాంగ్రెస్‌కు మద్దతిస్తున్న బీజేపీ, ఎంఐఎం పార్టీలతో పాటు బీఆర్ఎస్ చీలిక వర్గం ఆనంద్‌కుమార్‌కు బాహాటంగానే మద్దతు ప్రకటిస్తుండటంతో ఆయన చైర్మన్‌గా ఎన్నికవడం లాంచనమేనని ప్రచారం జరుగుతోంది. ఎన్నిక అయిన వెంటనే ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలుస్తోంది. ఇక వైస్ చైర్మన్ విషయంలో మాత్రం కాంగ్రెస్‌కు తలనొప్పి తప్పడం లేదు. మైనారిటీలకు ఇవ్వాలని పార్టీ నిర్ణయించగా.. మైనారిటీలలో ముగ్గురు పోటీ పడుతున్నారు. 29వ వార్డు కౌన్సిలర్ మోయిన్‌అలీ పేరు ప్రధానంగా చర్చకు రాగా, ఆయనకు కాంగ్రెస్ మిత్రపక్ష పార్టీలు మద్దతు ఇవ్వబోమని స్పష్టం చేశాయి. దాంతో షబ్బీర్ అలీ పేరు పరిశీలనకు వచ్చింది. ఆయనకు ఇస్తే తాము మద్దతు ఇవ్వబోమని మోయిన్‌అలీ వర్గం భీష్మించడంతో ఎటూ తేల్చుకోలేని పరిస్థితి నెలకొంది. ఇక మైనారిటీలోనే మరో వ్యక్తి ఉమ్మర్ పేరు తెరపైకి వచ్చింది. ఈ ముగ్గురి మధ్య తీవ్ర పోటీ నడుస్తోంది. సోమవారం ఉదయం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కౌన్సిలర్లతో భేటీ అయ్యి.. అందరి అభిప్రాయంతో వైస్ చైర్మన్‌ను నిర్ణయించనున్నారు. కాగా చైర్మన్‌కు మద్దతిస్తున్న ఓ పార్టీ.. వైస్ చైర్మన్ ఎన్నికకు దూరంగా ఉండాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. అదేవిధంగా కొందరు చైర్మన్‌కు మద్దతు తెలిపి, వైస్ చైర్మన్ ఎన్నిక ఓటింగ్‌లో పాల్గొనకుండా వెళ్లిపోవాలని నిర్ణయించినట్లు తెలిసింది. వైస్ చైర్మన్ స్థానానికి పోటీ చేస్తున్న బీఆర్ఎస్ తమకు క్రాస్ ఓటింగ్ జరుగుతుందన్న ఆశాభావంతో ఉంది. దీంతో ఇప్పుడు చైర్మన్ కన్నా వైస్ చైర్మన్ ఎన్నికనే రసవత్తరంగా మారింది. కాంగ్రెస్ మద్దతుదారులు ఆదివారం మధ్యాహ్నం తరువాత హైదరాబాద్ క్యాంప్‌కు బయలుదేరి వెళ్లారు. రాత్రికి అక్కడే ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమక్షంలో చర్చించి, వైస్ చైర్మన్ అభ్యర్థిని ఖరారు చేయనున్నట్లు సమాచారం. పోటీలో ఉన్నవారితో సంప్రదింపులు జరిగి ఏకాభిప్రాయంతో అభ్యర్థిని ఎంపిక చేయనున్నట్లు పార్టీలో చర్చ సాగుతోంది.

బీజేపీకి ఇవ్వాలని ఉన్నా

కాగా మొదట్లో బీజేపీకి వైస్ చైర్మన్ ఇవ్వాలని పార్టీలో జోరుగా చర్చ సాగింది. ఆ పార్టీ కౌన్సిలర్ అంజయ్య కూడా తనకు వైస్ చైర్మన్ పదవి ఇవ్వాలని అవిశ్వాస సమయంలో కోరారు. కాంగ్రెస్ కూడా దాదాపుగా అంగీకరించిందని తెలిసింది. అయితే బీజేపీకి అవకాశం ఇస్తే త్వరలోనే జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఈ రెండు పార్టీలు ఒకటేనని ప్రచారం జరిగే అవకాశం ఉండటంతో రెండు పార్టీలు ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ఎన్నికకు అన్ని ఏర్పాట్లు


చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక కోసం అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. కేవలం సభ్యులను మాత్రమే కౌన్సిల్ హాల్‌లోకి అనుమతించనున్నారు. మునిసిపాలిటీ వద్ద పెద్ద ఎత్తున పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. కాంగ్రెస్ సభ్యులు నేరుగా 10:30 గంటలకు బస్సులో మునిసిపల్ కార్యాలయానికి చేరుకోనున్నారు. చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో పట్టణ ప్రజలంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఎన్నిక నేపథ్యంలో పట్టణ ప్రజలు.. కాంగ్రెస్ కేడర్‌తోపాటు అభిమానులు అధిక సంఖ్యలో మునిసిపల్ కార్యాలయానికి చేరుకునే అవకాశం ఉంది.



ఇసుక లేక నెల రోజులుగా ఆగిన భవన నిర్మాణం

- ఖిల్లాఘణపురం మండలంలో ఇసుక కొరత
- ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుని 200 మంది ఎదురుచూపులు
- పనులు లేక నిర్మాణ రంగ కార్మికుల పస్తులు

నిలిచిన.. నిర్మాణాలు



ఎద్దుల బండ్లపై తీసుకెళ్తున్న ఇసుక

ఖిల్లాఘణపురం, ఫిబ్రవరి 11: ఇసుక కొరతతో వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భవన నిర్మాణాలకు, ప్రభుత్వ పనులకు ఇసుక లభించకపోవడంతో అవస్థలు తప్పడం లేదు. గృహ నిర్మాణాల కోసం నెలల కిందట ఆన్‌లైన్‌లో ఇసుక బుకింగ్ చేసుకున్నా.. రాకపోవడంతో నిర్మాణాలు నిలిచిపోయాయి. మండలంలో సుమారు 200 మంది ఇసుక కోసం ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకొని మూడు నెలలుగా ఎదురు చూస్తున్నారు. దాంతో పనులు లేక భవన నిర్మాణ కార్మికులు పస్తులతో కాలం వెళ్లదీస్తున్నారు. మండలంలోని కమలొద్దీన్‌పూర్ రీచ్ నుంచి గతంలో ఇసుకను ఇష్టారీతిన తరలించారు. దాంతో రీచ్ ఖాళీ అయ్యింది. దాంతో ఇసుక కోసం బుకింగ్ చేసుకున్నా సరఫరా కావడం లేదు. దళారుల నుంచి అధిక ధరలకు కొనలేక.. ఇటు నిర్మాణాలు సాగక.. ఆందోళనకు గురవుతున్నారు. నిర్మాణాలు చివరి దశలో ఉన్న వారు వాగుల్లోంచి ఎద్దుల బండ్ల ద్వారా సరఫరా చేస్తున్న ఇసుకను కొంటున్నారు. ఒక బండికి రూ.1,000 చొప్పున ఇచ్చి, కొనుగోలు చేస్తున్నారు. ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా ట్రాక్టర్ ఇసుకకు రూ.2,600 ధర ఉండగా.. కొంతమంది దళారులు వారం కిందట డంపు చేసిన ఇసుకను రూ.4,000 చొప్పున అమ్ముకున్నారు. ప్రస్తుతం నాణ్యత లేని ఫిల్టర్ ఇసుకకు సైతం డిమాండ్ పెరిగింది. ఇసుక కొరతతో పనులు నిలిచిపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని భవన నిర్మాణ కార్మికులు వాపోతున్నారు. గతంలో ఇసుకను విచ్చలవిడిగా అక్రమ మార్గంలో అమ్ముకోవడంతో రీచ్‌లలో కొరత ఏర్పడిందని విమర్శలు వస్తున్నాయి. ప్రస్తుతం ఇసుక కావాలంటే కలెక్టర్ అనుమతులు తప్పనిసరి చేశారు. కలెక్టర్ ఆదేశాలతోనే తహసీల్దార్ ట్రిప్ షీట్లు పంపిణీ చేస్తున్నారు. వినియోగదారుల అవసరాలకు చౌకగా ఇసుకను అందించాల్సిన అధికారులు కొరతతో చేతులెత్తేస్తున్నారు. పట్టా భూముల్లో ఇసుక ఉన్న రైతుల ద్వారా భవన నిర్మాణాలకు పంపిణీ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇళ్ల నిర్మాణాలకే ఇలా కొరత ఉంటే ప్రభుత్వం సీసీ రోడ్ల నిర్మాణాన్ని ఎలా చేపడుతుందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఇసుక లేదు



రైతుల పట్టా పొలాల్లో, వాగుల్లో ఇసుకను తీయాలంటే కలెక్టర్ అనుమతి తప్పనిసరి. మండలంలోని కమలొద్దీన్‌పూర్ రీచ్‌లో ఇసుక లేకపోవడంతో ఆన్‌లైన్‌లో ఇసుక బుకింగ్ చేసిన వారికి సరఫరా చేయలేకపోతున్నాం. వాగుల్లో ఇసుక లేకపోవడంతో అనుమతులు ఇవ్వడం లేదు. ప్రభుత్వ పనులకు సైతం ఇసుక కొరత ఏర్పడింది.

– పాండు, తహసీల్దార్, ఖిల్లాఘణపురం

భవన నిర్మాణ పనులు ఆగిపోయాయి



ఇసుక లేక గ్రామాల్లో భవన నిర్మాణ పనులు ఆగిపోయాయి. పనులు లేక నిర్మాణ రంగ కార్మికులు పూట గడువక ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో సరైన పద్ధతిలో ఇసుక రవాణా చేసి ఉంటే ఇప్పుడు ఇబ్బందులు ఏర్పడేవి కావు. ప్రభుత్వం ఇసుక రవాణాకు సడలింపులతో అనుమతులు ఇస్తే అసంపూర్తి నిర్మాణాలు పూర్తవుతాయి.

– సతీష్, తాపీ మేస్త్రీ, ఖిల్లాఘణపురం

విశ్వశాంతిని కోరే విశ్వగీతం

ఎన్ ఇన్వాల్యుబుల్ ఇన్వోకేషన్

- జడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణాసుధాకర్‌రెడ్డి
- ప్రపంచ శాంతి కోసమే రచన
- ప్రపంచంలోనే ఇది అత్యంత ఖరీదైన పుస్తకం
- వెల రూ.ఐదు కోట్లు: డాక్టర్ వంగీపురం శ్రీనాథాచారి
- ఘనంగా పుస్తకావిష్కరణ సభ




పుస్తకాన్ని ప్రదర్శిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణాసుధాకర్‌రెడ్డి, రచయిత డాక్టర్ వి.శ్రీనాథాచారి తదితరులు

పాలమూరు, ఫిబ్రవరి 11 : ప్రపంచశాంతి కోరేది విశ్వగీతం"ఎన్ ఇన్వాల్యుబుల్ ఇన్వోకేషన్" పుస్తకమని జెడ్పీ చైర్‌పర్సన్ ఎస్.స్వర్ణమ్మ, పలువురు వక్తలు అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని జెడ్పీ హాలులో ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రసిద్ధ రచయిత, లిమ్కా, గిన్నిస్ వరల్డ్ రికార్డుల గ్రహీత, డా.వంగీపురం శ్రీనాథాచారి రచించిన విశ్వశాంతిని కోరే విశ్వగీతం"ఎన్ ఇన్వాల్యుబుల్ ఇన్వోకేషన్"పుస్తకాన్ని ఘనంగా ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జెడ్పీ చైర్మన్ ఎస్.స్వర్ణమ్మ మాట్లాడుతూ విశ్వశాంతిని కోరి డా.వి.శ్రీనాథాచారి రచించిన ఈ పుస్తకం ప్రపంచ ప్రసిద్ధి పొందాలని ఆకాంక్షించారు. ప్రపంచంలో ఉన్న అనేక సమస్యలను తన పుస్తకంలో ఆవిష్కరించిన తీరు ప్రసంశనీయమన్నారు. ఇప్పటికే అనేక గిన్నిస్ వరల్డ్ రికార్డులను సొంతం చేసుకున్న శ్రీనాథాచారి రచించిన ఈ పుస్తకం గిన్నిస్ రికార్డు సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రముఖ రచయిత, కవి, ఆకాశవాణి రీడర్ డాక్టర్ సమ్మెట నాగమల్లేశ్వరరావు పుస్తక సమీక్ష చేస్తూ ప్రపంచ సాహిత్య చరిత్రలో ఇప్పటివరకు ఇలాంటి గొప్ప పుస్తకం రాలేదన్నారు. విశ్వశాంతిని కోరి రచించిన ఈ పుస్తకం ప్రపంచంలో పెద్ద పెద్ద రికార్డులు సాధిస్తుందనడంలో ఎలాంటి అతిశయోక్తిలేదన్నారు. సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ విద్యావేత్త డా.లక్ష్మణ్‌గౌడ్ మాట్లాడుతూ పాలమూరు జిల్లాకు చెందిన శ్రీనాథాచారి ప్రపంచ స్థాయి పుస్తకాన్ని రచించడం జిల్లాకు గర్వకారణమన్నారు. పుస్తక రచయిత డాక్టర్ వంగీపురం శ్రీనాథాచారి మాట్లాడుతూ 30 ఏళ్ల అనుభవంతో, మూడేళ్ల కఠోర దీక్షతో ఈ పుస్తకాన్ని రచించానన్నారు. ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన పుస్తకమిదన్నారు. దీని ధర ఐదు కోట్ల రూపాయలని, ఈ పుస్తకం అమ్మగా వచ్చిన డబ్బులో మొత్తం ఐక్యరాజ్యసమితికి యాభై శాతం, భారతదేశానికి 25 శాతం, తెలంగాణ ప్రభుత్వానికి 25 శాతం ఇస్తానని తెలిపారు. ఇందులో ప్రపంచంలోని 197 దేశాలలోని సమస్యలను 237 కవితలలో ఆవిష్కరించానన్నారు. త్వరలోనే అందరికీ అందుబాటులో తెస్తానన్నారు. ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న అనేక సమస్యలను ఇందులో ఆవిష్కరించానన్నారు. ఏదేశంలోనైనా సమస్యలన్నీ ఒక్కటేనని వాటిని పరిష్కరించబడాలనే ఉద్దేశంతో ఈ పుస్తకాన్ని రచించారన్నారు. ప్రపంచ సాహిత్య చరిత్రలోనే అత్యంత సుదీర్ఘమైన సంబోధనాత్మక భావగీతంగా ఈ పుస్తకాన్ని రచించినట్లు తెలిపారు. డా.వి.శ్రీనాథాచారి రచించిన ఈ పుస్తకానికి అనేక అంతర్జాతీయ అవార్డులు వస్తయని, పాలమూరు కీర్తిపతాక ప్రపంచ స్థాయిలో రెపరెపలాడుతుందని పాలమూరు సాహితి అధ్యక్షుడు డా.భీంపల్లి శ్రీకాంత్ అన్నారు. అనంతరం డా.వి.శ్రీనాథాచారిని జ్ఞాపిక, శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ మహిళ సాహిత్య సాంస్కృతిక సంస్థ అధ్యక్షులు రాపూరి వనజ, రెడ్‌క్రాస్ చైర్మన్ లయన్ నటరాజ్, మాజీ డీఈవో డా.ఎస్ విజయ్‌కుమార్, సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జగపతిరావు పాల్గొన్నారు.

సోమశిలకు పర్యాటకుల తాకిడి




సోమశిల వద్ద కృష్ణానది అందాలు



పురాతన సోమేశ్వరాలయం



కృష్ణానది వద్ద పర్యాటకుల సందడి



రెండు కొండల నడుమ కృష్ణమ్మ అందాలు

ఉమ్మడి పాలమూరు జిల్లాలో పర్యాటక ప్రాంతంగా ప్రసిద్ధిగాంచిన సోమశిల కృష్ణా నది అందాలను చూసేందుకు పర్యాటకులు తరలొస్తున్నారు. శని, ఆదివారాల్లో అధిక సంఖ్యలో వస్తున్నారు. ప్రకృతి అందాలను చూసి పరవశించిపోతున్నారు. నదిలో స్నానం చేసి, తన్మయత్వం పొందుతున్నారు. ప్రాచీన నవగ్రహ జ్యోతిర్లింగాలు కలిగిన సోమేశ్వరాలయాన్ని దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటున్నారు. ఈ ఏడాది రెండు నెలల ముందే కృష్ణానది ఎండుముఖం పట్టినా పర్యాటకుల తాకిడి తగ్గడం లేదు. స్థానిక ఎమ్మెల్యే జూపల్లి కృష్ణారావు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

– కొల్లాపూర్

కొనసాగుతున్న తనిఖీలు



మహమ్మదాపూర్ మీనాక్షి రైస్ మిల్లులో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

పాన్‌గల్, ఫిబ్రవరి 11: వనపర్తి జిల్లాలోని ఐదు రైస్ మిల్లులను విజిలెన్స్ అధికారులు రెండు రోజులుగా తనిఖీలు చేస్తున్నారు. సీఎంఆర్ ధాన్యం అవకతవకలపై కేసు నమోదైన నమోదు కావడంతో వాటిలో సోదాలు చేస్తున్నారు. గత నెలలో కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్ సీఎంఆర్ ధాన్యం సేకరణపై ప్రత్యేక దృష్టి సారించడంతో అనేక లొసుగులు బయట పడ్డాయి. రైస్ మిల్ అసోసియేషన్, రైస్ మిల్లర్లతో పలుమార్లు సమావేశం నిర్వహించి, గడువులోగా సీఎంఆర్ బియ్యం ఎఫ్‌సీఐకి ఇవ్వాలని, లేదంటే రెవెన్యూ రికవరీ చట్టం కింద చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫలితంగా మిల్లర్ల నుంచి గత నెలలో బియ్యం అప్పగించే ప్రక్రియ ఊపందుకుంది. డిసెంబరు 31, 2023 నాటికి ఎఫ్‌సీఐకి 3,570 ఏసీకేలు ఇవ్వాల్సి ఉండగా, జనవరి నాటికి 940 ఏసీకేలు అందించారని, ఇంకాస్త ప్రయత్నం చేస్తే ఈ నెల 29 నాటికి మొత్తం బియ్యాన్ని రికవరీ చేయవచ్చన్నారు.

ఆ ఐదు మిల్లులపై కేసులు: కొత్తకోట మండలంలోని మీరాసిపల్లి గ్రామ పరిధిలో గల ఇషాన్ ట్రేడర్, పాన్‌గల్ మండలంలోని మహమ్మదాపూర్ మీనాక్షి ఫుడ్ ప్రొడక్షన్, వనపర్తి పట్టణంలోని కేదారనాథ్ రైస్‌మిల్, పాన్‌గల్ మండల పరిధిలోని ఇషాన్ ఆగ్రో, పరమేశ్వర రైస్ మిల్లులపై జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు గత నెలలో కేసులు నమోదు చేశారు. ప్రభుత్వం కేటాయించిన బస్తాలకు, మిల్లుల్లో నిల్వ ఉన్న బస్తాలకు తేడా ఉన్నట్లు గుర్తించారు. సుమారు 2,25,179 బస్తాల ధాన్యం లోటు ఉన్నట్లు గుర్తించి, కేసులు నమోదు చేశారు. అయితే కక్ష్య సాధింపులో భాగంగానే తన రైస్ మిల్లులపై తనిఖీలు చేపడుతున్నారని యజమాని పరమేశ్వర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్.. ప్రధాన విజిలెన్స్ అధికారి ప్రకాశ్ నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని పంపించి శనివారం నుంచి తనిఖీలు చేయిస్తున్నారు. అధికారులు ధాన్యం బస్తాలను లెక్కిస్తున్నారు. తనిఖీల అనంతరం తుది నివేదిక రావాల్సి ఉంది.

విద్యుదాఘాతంతో రైతు మృతి

రేవల్లి, ఫిబ్రవరి 11 : మండలంలోని నాగపూర్ గ్రామానికి చెందిన దొడ్డి నిరంజన్ (59) అనే రైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. వనపర్తి జిల్లా నాగపూర్ గ్రామంలో శనివారం రాత్రి ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ తిరుపతిరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగపూర్ గ్రామానికి చెందిన రైతు దొడ్డి నిరంజన్ తన పొలంలో మొక్కజొన్న సాగు చేశాడు. పంట కాపుకు రావడంతో శనివారం రాత్రి కాపలా కోసం పొలానికి వెళ్లాడు. ఆదివారం ఉదయం ఇంటికి రాకపోవడంతో అతడి కుమారుడు వెంకటేష్ పొలానికి వెళ్లాడు. అక్కడ తండ్రి మృతి చెంది ఉండటం చూసి కుటుంబసభ్యులకు, పోలీసులకు సమాచారం అందించడంతో వారొచ్చి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కొరకై రేవల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కొడుకు వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిరుపతిరెడ్డి తెలిపారు. అయితే పొలంలోని బోరు దగ్గరున్న స్టార్టర్ బాక్స్ నుంచి సమీపంలోని రేకుల గదికి విద్యుత్ కనెక్షన్ ఉంది. గదిలో బల్బు వెలగకపోవడంతో కనెక్షన్‌ను పరిశీలిస్తూ, విద్యుదాఘాతానికి గురై మృతి చెంది ఉండొచ్చని కుటుంబసభ్యులు, గ్రామస్థులు భావిస్తున్నారు.

జోగుళాంబ ఆలయంలో హోమాలు



అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు




జోగుళాంబ అమ్మవారు

అలంపూర్ చౌరస్తా, ఫిబ్రవరి 11: జోగుళాంబ అమ్మవారి వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రెండో రోజు ప్రత్యేక హోమాలు నిర్వహించారు. వీటితోపాటు విశేష అచర్చలు, చండీహోమం, పవమాన సూక్త పారాయణం, ఆవాహిత దేవతా హోమం, మండపారాధన, బలిహరణం, నీరాజనమంత్ర పుష్పములు నిర్వహించారు. రెండో రోజు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. సుమారు రెండువేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.








స్కూల్ స్వీపర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

పాలమూరు, ఫిబ్రవరి 11 : స్కూల్ స్వీపర్ల కుటుంబాలను ప్రభుత్వం ఆదు కోవాలని స్కూల్ స్వీపర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రాయుడు, టీఎఫ్‌టీ యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం. ఖలీల్, పి.విజయ్‌కుమార్‌లు డిమాండ్ చేశారు. ఈమధ్య మరణించిన స్వీపర్ సత్తార్ కుటుంబాన్ని ఆదుకోవాలని ఆదివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో నివాళి అర్పించారు. నేటికి తొమ్మిది నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కేవలం రూ. 1600ల గౌరవ వేతనంతో స్వీపర్లు నెలంతా పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్వీపర్లను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో జి.గట్టన్న, సామాజికవేత్త యం.డి హనీఫ్‌అహ్మద్, నాగరాజు, నరిసింహులు, భాస్కర్, రామస్వామి, జమీర్, భాష, ఆంజనేయులు పాల్గొన్నారు.







అప్పాజిపల్లి మాజీ సర్పంచ్‌కు

జాతీయ స్థాయి అవార్డు



బహుజన సాహిత్య అకాడమీ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు గౌతం చేతుల మీదుగా జాతీయ స్థాయి అవార్డు అందుకుంటున్న మాజీ సర్పంచ్ జల్లి తిరుపతమ్మ

తిమ్మాజిపేట, ఫిబ్రవరి 11: నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం అప్పాజిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ జల్లి తిరుపతమ్మ జాతీయ స్థాయి ఉత్తమ సర్పంచ్ అవార్డు అందుకున్నారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో బహుజన రైటర్స్ ఏడవ సౌత్ ఇండియా కాన్ఫరెన్స్‌లో బహుజన సాహిత్య అకాడమీ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్ చేతులమీదుగా ఆమె ఈ అవార్డును అందుకున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ పథకంలో భాగంగా గ్రామంలో చేపట్టిన పారిశుధ్య కార్యక్రమాలను విజయవంతం చేయడంతో జిల్లా, రాష్ట్ర స్థాయిలోను అప్పాజిపల్లి పంచాయతీ అవార్డులు దక్కించుకోగా, గ్రామాభివృద్ధి పనుల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం గత ఏడాది రూ.10లక్షలు మంజూరు చేసింది. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ జల్లి తిరుపతమ్మ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థుల సహకారంతో గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేస్తూ జాతీయ స్థాయిలో గ్రామానికి గుర్తింపు తెచ్చి అవార్డులు అందుకున్నట్లు తెలిపారు. తిరుపతమ్మకు జాతీయ స్థాయి ఉత్తమ సర్పంచ్ అవార్డు రావడంపై గ్రామస్థులు, ఆయా పార్టీల నాయకులు, అధికారులు ఆమెకు అభినందనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కల్వకుర్తి, ఫిబ్రవరి 11 : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం మేడిపూర్ గేటు సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్సై జి.మాధవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తాడూరు మండలం మేడిపూర్‌కు చెందిన బొల్లె పరుశరాములు(35) శనివారం రాత్రి స్వగ్రామం నుంచి కల్వకుర్తికి స్కూటీపై బయల్దేరాడు. కల్వకుర్తి నుంచి నాగర్‌కర్నూల్ వైపు వెళ్తున్న కారు మేడిపూర్ గేటు సమీపంలో ఢీకొనడంతో పరశురాములు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



దీన్‌దయాళ్ చిత్రపటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న డీకే అరుణ తదితరులు

దీన్‌దయాళ్ అడుగుజాడల్లో నడవాలి

మహబూబ్‌నగర్ (క్లాక్‌టవర్), ఫిబ్రవరి 11 : కొందరు మరణించే వరకు జీవిస్తారని, మరికొందరు మరణించిన తర్వాత కూడా జీవిస్తారని, పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ రెండవ కోవకు చెందినవారని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. ఆదివారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ 56వ బలిదాన్ దివస్ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి అరుణ పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రపంచంలో అతిపెద్ద పార్టీగా అవతరించిన భారతీయ జనతా పార్టీకి ప్రతిష్ఠ పునాదులు వేసిన సమర్థ నిర్వాహకుడు పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అని పేర్కొనారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధక్షుడు పి. శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పద్మజారెడ్డి, పడాకుల బాలరాజు, అసెంబ్లీ కన్వీనర్ అచ్చుగట్ల అంజయ్య, కోశాధికారి పాండురంగారెడ్డి, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి, నాయకులు కృష్ణవర్ధన్‌రెడ్డి, పడాకుల సత్యం, కిష్యానాయక్, కేతూరి బుడ్డన్న, పట్టణ అధ్యక్షుడు నారాయణ యాదవ్ నివాళ్లు అర్పించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

దేవరకద్ర, ఫిబ్రవరి 11 : తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగి బంగారు, వెండి, నగదు తీసుకెళ్లారు. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం పెద్ద గోప్లాపూర్ గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. ఎస్ఐ నాగన్న తెలిపిన వివరాల ప్రకారం... పెద్ద గోప్లాపూర్ గ్రామంలో తిమ్మన్న, నాగలక్ష్మి భార్యాభర్తలు. వీరు కొంతకాలంగా ముంబైలో ఉంటూ ప్లంబర్ పని చేస్తుంటారు. అప్పుడప్పుడూ స్వగ్రామానికి వచ్చిపోతుంటారు. గ్రామంలో వీరి ఇంట్లో 30 తులాల వెండి, రెండు తులాల బంగారం, రూ. రెండు లక్షల నగదు చోరీ జరిగింది. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి ఎస్ఐ నాగన్న చేరుకొని పరిశీలించారు. సీసీ కెమెరాల స్టోరేజ్ బాక్స్‌ను కూడా దొంగలు దోచుకెళ్లినట్లు తెలిపారు. తిమ్మన్న బావమరిది నరేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మాజీ సర్పంచ్‌కు 14 రోజుల రిమాండ్

అచ్చంపేట టౌన్, ఫిబ్రవరి 11 : భూపత్రాలను తారుమారు చేస్తున్నారన్న ఆరోపణలతో బొమ్మన్‌పల్లి బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ బోడ్యానాయక్, రెవెన్యూ ఉద్యోగి హన్మంతులను 14 రోజుల రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై రాము తెలిపారు. గత గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట తహసీల్‌లో బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ బోడ్యానాయక్, రెవెన్యూ ఉద్యోగి హన్మంతు కార్యాలయంలో భూరికార్డులను మారుస్తున్నారన్న అనుమానంతో కాంగ్రెస్ నాయకులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. అనంతరం తహసీల్దార్ అధికారుల ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేశామన్నారు. ఆదివారం మాజీ సర్పంచ్ బోడ్యానాయక్‌ను అరెస్ట్ చేసి 14 రోజుల రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తెలిపారు. హన్మంతుపై విచారణ కొనసాగుతోందన్నారు.



జాతీయ స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఎంపిక

గద్వాల టౌన్, ఫిబ్రవరి 11 : బాల వైజ్ఞానిక ప్రదర్శనలో భాగంగా పట్టణంలోని ప్రగతి పాఠశాల విద్యార్థిని గాయత్రి రూపొందించిన నమూనా జాతీయ స్థాయికి ఎంపికైంది. జాతీయస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ (బాల వైజ్ఞానిక ప్రదర్శనలో)లో 'ఆరోగ్యం' అనే అంశంపై విద్యార్థిని ప్రదర్శించిన నమునా దక్షిణ భారతదేశ స్థాయిలో ఎంపికై ద్వితీయ స్థానం దక్కించుకుంది. ఈ సందర్భంగా ఆదివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కరస్పాండెంట్ సవారన్న విద్యార్థిని గాయత్రిని అభినందించారు.

కోడి పందెం స్థావరంపై దాడి

నాగర్‌కర్నూల్ క్రైం, ఫిబ్రవరి 11 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని నల్లవెల్లి రోడ్డులో కోడి పందెం స్థావరంపై పోలీసులు దాడి చేశారు. దాడిలో 14 బైకులు, ఏడు సెల్‌ఫోన్లు, రూ.6 వేల నగదు స్వాధీనపర్చుకొని, ఏడుగురిని అదుపులోకి తీసుకున్నామని ఎస్సై గోవర్ధన్ తెలిపారు. మిగతా కొంతమంది పరారైనట్లు తెలిపారు. పట్టుబడిన ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పాలమూరు-రంగారెడ్డి ఫేస్-2కు పరిపాలన అనుమతులు

- ఏఐసీసీ కార్యదర్శి, మాజీ మంత్రి జిల్లెల చిన్నారెడ్డి

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 11: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి 8వ తేదీన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం రెండో భాగానికి జీవో 14 ద్వారా పరిపాలన అనుమతులు వచ్చాయని ఏఐసీసీ కార్యదర్శి మాజీ మంత్రి జిల్లెల చిన్నారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయంలోనే కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జీవో 72 ద్వారా పరిపాలన అనుమతులు తెచ్చామన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత రీ డిజైన్ పేరుతో ఈ పథకాన్ని జూరాల సోర్స్‌ను మార్చి శ్రీశైలం బ్యాక్ వాటర్ సోర్స్‌కు పోవడం జరిగిందన్నారు. రూ. 35 వేల కోట్ల ప్రాజెక్టును కేసీఆర్ రీడిజైన్ పేరుతో రూ. 55 వేల కోట్లకు పెంచాడని అన్నారు. అలాంటి ప్రాజెక్టు పనులు నేటికీ దాదాపు 40 శాతం కూడా పూర్తి కాలేదన్నారు. పరిపాలన అనుమతులు పొందిన రూ. 55 వేల కోట్లలో కేవలం రూ. 27 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌కు కాలేశ్వరం ప్రాజెక్టుపై ఉన్న ప్రేమ పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై లేదన్నారు. పాలమూరు రంగారెడ్డి పథకంలో నార్లాపూర్, ఏదుల, వట్టెం రిజర్వాయర్‌లు ఉన్నాయని, వట్టెం నుంచి భూమి ఆకర్షన ద్వారా కర్వేనా ప్రాజెక్టుకు పోతుందని, వట్టెం నుంచి ఉదండాపూర్ ప్రాజెక్టుకు ఎత్తిపోతల అని, ఉదండాపూర్ నుంచి లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు చివరిదన్నారు. పాలమూరు జిల్లాకు 9 లక్షల ఎకరాలు, రంగారెడ్డి 3 లక్షల ఎకరాలు, నల్గొండకు 30 వేల ఎకరాలకు నీళ్లు ఇచ్చే ఈ ప్రాజెక్టును కేసీఆర్ నాశనం చేశాడని విమర్శించారు. ఇప్పుడు ఫేస్-2 పేరుతో జూరాల బ్యాక్ వాటర్ ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే పనులు చేపడతామని గతంలోనే చెప్పినట్లుగానే ఇచ్చిన మాట ప్రకారం నేడు సీఎం రేవంత్‌రెడ్డి జీవో నెంబరు 14తో రూ. 2945 కోట్లతో పరిపాలన అనుమతులు ఇచ్చారని తెలిపారు. దీంతో కొడంగల్, నారాయణపేట, మక్తల్ నియోజకవర్గాలకు లక్ష ఎకరాలకు నీళ్లు వచ్చే అవకాశం ఉందన్నారు. ఫేస్-1లో మిగిలిన పనులు, తాజాగా ఫేస్-2 ద్వారా చేపట్టబోయే పనులను కాంగ్రెస్ ప్రభుత్వం 100 శాతం పూర్తి చేయబోతుందని ధీమా వ్యక్తం చేశారు. ఉమ్మడి పాలమూరు ప్రజల చిరకాల వాంఛ తీర్చుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో మైనారిటీ సెల్ రాష్ట్ర నాయకుడు కమ్మర్ మియా, ఎండీ బాబా, నరహరి, దివాకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి చిన్నారెడ్డి

నేటి నుంచి క్రికెట్ టోర్నమెంట్

గద్వాల అర్బన్, ఫిబ్రవరి 11 : రాజీవ్‌గాంధీ స్మారక ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఇన్విటేషన్ క్రికెట్ టోర్నమెంట్ సీజన్-3 ఈ నెల 12నుంచి 18 వరకు జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో జోగుళాంబ గద్వాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా బీసీ సెల్ చైర్మన్ నల్లారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో ఉమ్మడి జిల్లా నుంచి 16 జట్లు జడ్చర్ల, కొల్లాపూర్, పెబ్బేరు, అచ్చంపేట, షాద్‌నగర్, మహబూబ్‌నగర్, వనపర్తి, దేవరకద్ర, ఎన్‌జీఆర్‌ఎల్ టైరాన్స్, అజయ్ ఎలెవెన్, క్రిష్ణ ఎలెవెన్, డీటీటీసీ నరసింహ ఎలెవెన్, జీసీసీ శ్రీసౌమ్య ఎలెవన్, శంకర్ ఎలెవెన్, మెఘ ఎలెవెన్, మెమిన్ స్టార్ జట్లు పాల్గొంటాయన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


భాగ్యమ్మ (ఫైల్)

దామరగిద్ద, ఫిబ్రవరి 11 : రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. ఈ సంఘటన నారాయణపేట జిల్లా దామరగిద్ద మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ వసంత కథనం ప్రకారం.. దామరగిద్దకు చెందిన కోయిలకొండ భాగ్య మ్మ(60) అంబేడ్కర్ కూడలి లో రోడ్డు దాటుతుండగా మద్దూర్ మండలం రేణివట్ల గ్రా మానికి చెందిన మౌలానాతో పాటు మరో ఇద్దరు స్కూటి మీద అతి వేగంగా వచ్చి ఢీకొట్టారు. ఈ ఘటనలో భాగ్యమ్మ తలకు బలమైన గాయాలు కాగా చికిత్స నిమిత్తం నారా యణపేట జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ భాగ్యమ్మ మృతి చెందినట్లు తెలిపారు. బాధితురాలు కుటుంబీకులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వసంత తెలిపారు.

ద్విచక్రవాహనం అదుపు తప్పి చిన్నారి మృతి


నివేదిత

మక్తల్, ఫిబ్రవరి 11 : ఓ ద్విచక్ర వాహనం అదుపు తప్పి నాలుగేళ్ల చిన్నారి నివేదిత మృతి చెందింది. ఈ సంఘటన నారాయనపేట జిల్లా మక్తల్ మండలం బొందల్‌కుంట స్టేజీ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. చిట్యాల గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు రమేష్, అక్షితలకు నాలుగేళ్లలోపు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. అమ్మమ్మ, తాత వెంకటప్ప తిరుపతి వెళ్తుండటంతో నాలుగేళ్ల నివేదితను వెంట తీసుకుపోయారు. దైవ దర్శనం అనంతరం వారి స్వగ్రామం మరికల్‌కు శనివారం చేరుకున్నారు. సోమవారం నివేదిత పుట్టిన రోజు ఉండటంతో తల్లి దండ్రుల వద్దకు చేరవేసేందుకు తాత వెంకటప్ప ద్విచక్ర వాహనంపై నివేదితతో కలిసి చిట్యాలకు బయలుదేరాడు. బొందల్‌కుంట స్టేజీ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి పడిపోవడంతో నివేదిత అక్కడికక్కడే మృతి చెందింది. వెంకటప్పకు తీవ్ర గాయాలు కావడంతో మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. పుట్టిన రోజు వేడుకలకు ఒక రోజు ముందే నివేదిత మృతి చెందటంతో కుటుంబ సభ్యుల రోదన పలువురిని కంటతడి పెట్టించింది.

ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

- బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి
- యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఫిబ్రవరి 11 : రాష్ట్రంలో ఎనిమిదేళ్లుగా విద్యారంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని, ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మెట్టుగడ్డ ఆర్వీఎం సమావేశ మందిరంలో యూటీఎఫ్ జిల్లా కమిటీ విస్తృత స్థాయి సమావేశం జిల్లా అధ్యక్షుడు ఎన్.వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తమ సంఘం చేసిన పోరాటాల ఫలితంగా ప్రభుత్వం టీచర్ల బదిలీలు, పదోన్నతుల ప్రకియ ప్రారంభించిందని, కానీ, వివిధ కారణాల వల్ల కోర్టు వివాదాలు రావడంతో ప్రక్రియ నిలిచిపోయిందని అన్నారు. కొత్త ప్రభుత్వం వీటన్నింటిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీర్చి సంక్షోభాన్ని నివారించాలన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. టీచర్లకు సంబంధించి కామన్ సర్వీస్‌రూల్స్ అమలు చేయాలని, పండిట్ పీఈటీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయింపులు తగ్గించిందని, దేశంలో ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేయడమేనన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర బాధ్యులు ఎస్.కిష్టయ్య, పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రామదాసు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, రవికుమార్ మాట్లాడారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు ఉమాదేవి, నర్సిములు కోశాధికారి భాస్కర్, నాయకులు మణ్యం, రాములు, హేమంత్‌కుమార్, అజయ్, సుదర్శన్, తిరుపతమ్మ, కిష్యానాయక్, వెంకటయ్య, కృష్ణయ్య, శివరాజ్, వేణుగోపాల్, సృజన పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య

పాలమూరు ఎంపీ స్థానం బీసీలకు కేటాయించాలి

- ప్రముఖ సామాజిక వేత్త డాక్టర్ పి.వినయ్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న సామాజికవేత్త డాక్టర్ పి.వినయ్‌కుమార్

పాలమూరు, ఫిబ్రవరి 11 : మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానాన్ని అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు కేటాయించాలని ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ పి.వినయ్‌కుమార్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని రెడ్‌క్రాస్ భవనంలో తెలంగాణ బీసీ కులాల ఐక్యవేదిక ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాలకు చెందిన బీసీలు, వివిధ శాఖల నాయకులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేషన్ చైర్మన్‌ల నియామకాల్లో 50శాత బీసీలకు కేటాయించాలన్నారు. లేబర్ జిల్లాగా పేరుగాంచిన పాలమూరు జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. మాజీ కేంద్ర మంత్రి, దివంగత తెలంగాణ ఉద్యమ నేత మల్లికార్జునరావు విగ్రహాన్ని అసెంబ్లీలో ఏర్పాటు చేయాలని కోరారు. బీసీ నాయకులు సంజీవ్‌ముదిరాజ్, నరహరి, అక్కల బాబుగౌడ్, పాండు యాదవ్, విజయ్‌కుమార్, అశోక్, సంధ్యారాణి, బండి మల్లేష్, దేవేందర్, తోట శివల ప్రసంగించారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభివృద్ధి, రాజకీయంలో బీసీలకు కల్పించాల్సిన ప్రాధాన్యతపై పలు తీర్మానాలు చేశారు.

గిట్టుబాటు ధర కోసం పల్లీ రైతుల ఆందోళన


రాస్తారోకో చేస్తున్న రైతులు

కల్వకుర్తి, ఫిబ్రవరి 11 : గిట్టుబాటు ధర కోసం వేరు శనగ రైతులు ఆందోళన బాట పట్టారు. కమీషన్ ఏజెంట్లు, అధికారులు కుమ్మక్కై తమకు గిట్టుబాటు ధర రాకుండా చేస్తున్నారని పల్లీ రైతులు నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తాలో పెద్ద ఎత్తున ధర్నా, రాస్తారోకో నిర్వహించారు.

విషయం తెలుసుకున్న సీఐ నాగార్జున, కల్వకుర్తి, వంగూరు, వెల్దండ, ఊర్కొండ, చారకొండ ఎస్సైలు జి.మాధవరెడ్డి, మహేందర్, రవి, వీరబాబు, రాజశేఖర్, పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని రైతులను శాంతింపజేసే ప్రయత్నం చేశారు. మార్కెట్ అధికారులు, నాయకులు రైతులతో చర్చలు జరిపారు. పల్లీకి మద్దతు ధర రూ.4 వేల నుంచి రూ.5900 వచ్చిన రైతులకు అదనంగా రూ.400, రూ.6వేల నుంచి రూ.6500 వచ్చిన వారికి రూ.150, రూ.6500 నుంచి రూ.7 వేల వరకు వచ్చిన వారికి రూ.70 పెంచేందుకు నిర్ణయించడంతో రైతులు శాంతించారు. రాత్రి 7:30గంటలు దాటినా అన్నదాతలు మార్కెట్‌యార్డులోనే నిరీక్షించారు.

మన్యంకొండ స్వామివారి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

- ఈనెల 19 నుంచి మొదలవనున్న జాతర

మహబూబ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 11 : తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన మన్యంకొండ లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 19 నుంచి ప్రారంభం చేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేస్తున్నది. ఏర్పాట్లలో భాగంగా ఆలయానికి రంగులువేసే కార్యక్రమం మొదలుపెట్టారు. అదేవిధంగా ఆలయ తేరుమైదానం వద్ద భక్తులు సంచరించే ప్రాంతాల్లో, పార్కింగు స్థలాల్లో పిచ్చిమొక్కల తొలగింపు, చదును చేసే పనులు మొదలు పెట్టారు. కోనేరులను అందుబాటులోకి తెస్తున్నారు. భక్తులకు ఎ లాంటి ఇబ్బంది లేకుండా స్నానపు గదులు, నల్లాలు, టాయి లెట్లు ఏర్పాటు చేస్తున్నారు. కొండ కింద ప్రత్యేక బస్సులు నిలిపేందుకు తాత్కాలిక బస్టాండ్‌ని ఏర్పాటు చేస్తున్నారు. కొండ మీదకు వెళ్లే ఘాట్‌రోడ్డు మరమ్మతులు చేపట్టారు. మలుపుల వద్ద ఇబ్బందిలేకుండా చర్యలు చేపట్టారు. ఆలయధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్ నేతృత్వంలో ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు, ఉద్యోగులు ఈ పనులను పర్యవేక్షిస్తున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

జడ్చర్ల, ఫిబ్రవరి 11 : మండలంలోని కొడ్గల్ జడ్పీహెచ్ పాఠశాలలో ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ సీనియర్ వి ద్యార్థులకు పోటీలు ఆదివారం నిర్వహించి రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులు కరీంనగర్‌తో రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నట్లు పీఈటీ శం కర్‌నాయక్ తెలిపారు. రాష్ట్రా స్థాయికి ఎంపికైన విద్యార్థులను జడ్పీవైస్ చైర్మన్ యాదయ్య అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయికి ఎంపిక కావాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మమత నవీన్‌రెడ్డి, జిల్లా హ్యాండ్ బాల్‌సంఘం అధ్యక్షుడు నిరంజన్, యాదయయ్య, పాల్గొన్నారు.

అస్తిత్వం కోల్పోతున్న చేనేత సహకార సంఘాలు

- ఆరేళ్లుగా జరగని ఎన్నికలు - 12 సార్లు పాలక వర్గం గడుపు పొడిగింపు - నేటితో పాలక వర్గానికి గడువు పూర్తి

అయిజ, ఫిబ్రవరి 11: ప్రభుత్వాలు పట్టించుకోని కారణంగా చేనేత సహకార సంఘాలు అస్తిత్వం కోల్పోతున్నాయి. ఆరు సంవత్సరాలుగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించలేదు. దీనితో సంఘాలు నిర్వీర్యం కానున్నాయి. పాలకవర్గానికి 12 సార్లు గడువు పొడిగించింది. అది కాస్త సోమవారం గడువు పూర్తవుతోంది. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా ఎన్నికలు నిర్వహించాలని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

జోగుళాంబ గద్వాల జిల్లాలో 28 సహకార సంఘాలు ఉన్నాయి. జిల్లాలోని అయిజ, రాజోలి, గట్టు, అలంపూర్ సంఘాలు మాత్రమే ప్రస్తుతం టెస్కోతో లావాదేవీలు నిర్వహిస్తున్నారు. సంఘాల కార్యవర్గ సభ్యుల్లో మాస్టర్ వీవర్స్ చాలా మంది ఉన్నారు. కొంతమందైతే తమ వారితో కలిసి సొంత సహకార సంఘాలను ఏర్పాటు చేసుకుని లబ్ధి పొందుతున్నారు. ఆప్కోకు సహకార సంఘాల చేనేత చీరల పేరిట తమ సొంత చీరలను అమ్ముకుని లబ్ధి పొందుతున్నారు. ప్రతీ సంఘంలోనూ కొత్త వారిని చేర్చుకోవాలన్న, చనిపోయిన సభ్యుల స్థానంలో వారి కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేయాలన్న కార్యవర్గ సభ్యులు సమావేశమయ్యి తీర్మానించాల్సి ఉన్నది. జిల్లాలోని కొన్ని సంఘాలలో అలా చేయని కారణంగా జిల్లా అధికారులకు పలు మార్లు ఫిర్యాదు చేశారు. జరుగుతున్న అవకతవకలను అరికట్టాలని ఫిర్యాదు చేసిన పట్టించుకోవటం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. 2013వ సంవత్సరం ఫిబ్రవరి 12న చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. అది మొదలు ఇప్పటి వరకు సంఘాలకు ఎన్నికలు నిర్వహించలేదు. కొత్త పాలక వర్గాన్ని ఏర్పాటు చేయలేదు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికలను ఎప్పటికప్పుడు వాయిదా వేస్తూ వచ్చింది. గత పాత పాలక వర్గాలనే పర్సన్ ఇన్‌చార్జీలుగా కొనసాగిస్తూ వచ్చింది. ఎన్నికలు జరపకుండా ప్రతీ ఆరు నెలలకు ఒక సారి వాయిదావేస్తూ వచ్చింది. ఇప్పటికి 12 సార్లు వాయిదా వేశారు. అది కాస్త నేటితో పూర్తి కానుంది. కాంగ్రెస్ ప్రభుత్వ చొరవ తీసుకుని చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి కొత్త పాలక వర్గాన్ని ఏర్పాటు చేయాలని చేనేత కార్మికులు కోరుతున్నారు.


అయిజ చేనేత సహకార సొసైటీ కార్యాలయం

ప్రభుత్వ ఆదేశాల మేరకు పనిచేస్తాం



ప్రభుత్వ ఆదేశాల మేరకు పనిచేస్తాం. రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహిస్తారు. ఇప్పటి వరకు వాయిదా పడుతూ వచ్చాయి. ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాలు అమలు చేస్తాం. ఫిర్యాదులు అందితే ఆమేరకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తాం.

- గోవిందయ్య, చేనేత సహకార సంఘం జిల్లా అధికారి

సింగిల్ విండో సేవలు వినియోగించుకోవాలి

» ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి



సింగిల్ విండో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి

తెలకపల్లి, ఫిబ్రవరి 11 : సింగిల్ విండో కార్యాలయ సేవలను రైతులు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పెద్దూరులో సింగిల్ విండో కార్యాలయ నూతన భవన సముదాయం, వాణిజ్య సముదాయం, గోదాము, వేబ్రిడ్జిలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సింగిల్ విండో ద్వారా రైతులకు రాబోయే కాలంలో అనేక సేవలు అందుబాటులోకి రానున్నాయని, వాటిని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ వెంకటయ్య, విండో చైర్మన్ డి.భాస్కర్, ఎంపీపీ కొమ్ము మధు, విండో వైస్ చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య, డీసీవో పత్య నాయక్, డీసీఏవో రఘునందన్‌రావు, సీఈవో ధర్మవీర్, రాజమహేందర్ రెడ్డి, బుచ్చిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సింగిల్ విండో డైరెక్టర్లు పాల్గొన్నారు.

గౌస్ మొహియొద్దీన్ పుస్తకావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే



గౌస్ మొహియొద్దీన్ పుస్తకావిష్కరణలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట టౌన్, ఫిబ్రవరి 11 : గౌస్ మొహియొద్దీన్ జ్ఞాపకార్థంతో రచించిన హిందూ ధర్మం - ఇస్లాం పుస్తకం ఆవిష్కరణ సభను ఆదివారం పట్టణంలోని విశ్రాంతి భవనంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై, పుస్తకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా గౌస్ మొహియొద్దీన్ సమాజానికి చేసిన సేవలను ఎమ్మెల్యే కొనియాడారు. అనంతరం విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో విశాంత్ర ఉద్యోగులు పాల్గొన్నారు.

యువత ప్రజాసేవ కోసం ముందుకు రావాలి

బిజినేపల్లి, ఫిబ్రవరి 11 : గ్రామీణ ప్రాంత ప్రజలకు సేవ చేసేందుకు యువత రాజకీయాల్లోకి రావాలని మాజీ సర్పంచ్ గంగారం అశోక్ అన్నారు. మండలంలోని పోలేపల్లిలో ఆదివారం సుభాష్ యువజన సంఘం ఆధ్వర్యంలో సర్పంచ్ గంగారం అశోక్, ఉపసర్పంచ్ వసంతకుమార్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ భవిష్యత్‌లో గ్రామాభివృద్ధిలో కీలకపాత్ర పోషించాల్సిన బాధ్యత యువతపై ఉంటుందని అందుకు అనుగుణంగా నిస్వార్థంగా ప్రజాసేవ చేయాలని కోరారు. రాబోయే రోజుల్లో గ్రామంలో నెలకొన్న సమస్యలను గుర్తించి ప్రణాళిక రూపొందించుకొని ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించుకుందామన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, యువజన సంఘం సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, శ్రీశైలం, పర్వతాలు, మన్యం, అశోక్‌కుమార్, భానుప్రకాష్, శివ, మల్లేష్ తదితరులున్నారు.

అభయహస్తం పథకాల నమోదు ప్రక్రియ పరిశీలన

తిమ్మాజిపేట, ఫిబ్రవరి 11 : ప్రభుత్వం ప్రజలకు ఇవ్వనున్న సంక్షేమ పథకాల కోసం అభయహస్తం పేరుతో ఊరూరా తీసుకున్న దరఖాస్తులు ఆన్‌లైన్‌లో చేసిన నమోదు ప్రక్రియ పరిశీలన గ్రామాల్లో గత రెండు రోజులుగా కొనసాగుతోంది. తిమ్మాజిపేట మండల కేంద్రంలో ఆదివారం ప్రత్యేక అధికారి ఎంపీడీవో కరుణశ్రీ, పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్రరావుతో కలిసి ఇంటింటికి తిరుగుతూ గ్యాస్ సిలిండర్‌కు సంబంధించిన దరఖాస్తులు ఆన్‌లైన్‌లో వివరాలు సక్రమంగా ఉన్నాయా, లేదా అనే విషయాలను పరిశీలిస్తూ సక్రమంగా లేనివారి వివరాలు సేకరిస్తూ వారికి సూచనలు, సలహాలు చేస్తున్నారు. అదేవిధంగా 200యూనిట్ల ఉచిత విద్యుత్‌కు సంబంధించి తెల్ల రేషన్‌కార్డు కలిగిన కుటుంబాలను విద్యుత్ అధికారులు గుర్తిస్తున్నారు. గృహాలకు ఉచిత విద్యుత్ ఇవ్వడం పట్ల సామాన్య మధ్య తరగతి కుటుంబాలు తమ హర్షాన్ని వ్యక్తం చేస్తున్నారు.

విద్యా రంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి

పెంట్లవెల్లి, ఫిబ్రవరి 11 : రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని ఎస్‌ఎఫ్‌ఐ కొల్లాపూర్ డివిజన్ అధ్యక్షుడు సులుగిరి తరుణ్ అన్నారు. విద్యారంగానికి బడ్జెట్ తక్కువ కేటాయించడంపై ఆదివారం మండల పరిధిలోని జటప్రోల్ గ్రామంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి తగిన ప్రాధాన్యతనివ్వడం లేదని పేర్కొన్నారు. అదేవిధంగా విద్యార్థులకు మెస్‌చార్జీలు, ఫీజురీయింబర్స్ వంటి వాటిపై అసెంబ్లీలో స్పష్టత రాలేదని వాపోయారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ప్రవీణ్, జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

వంగూరు, ఫిబ్రవరి 11 : వారంతా 35 ఏళ్ల తరువాత కలుసుకున్నారు. పదిహేనేళ్ల వయస్సులో ఆ పాఠశాలలో చదువుకున్న జ్ఞాపకాలను ఒక్కసారిగా గుర్తు చేసుకున్నారు. తాము గడిపిన సమయాన్ని నెమరు వేసుకొని ఆనందంలో మునిగిపోయారు. వంగూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 1988-89 సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులంతా ఆదివారం ఒకే వేదికగా వంగూరులోని ఆ పాఠశాలలో కలుసుకున్నారు. పూర్వ విద్యార్థులు మొత్తం 45 మందికి గాను 40 మంది ఈ సమ్మేళనానికి హాజరైయ్యారు. ఈ సందర్భంగా వారు తమ గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాత్రికేయుడు రాజుతో పాటు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజన సేవా సంఘం కార్యవర్గం ఎన్నిక



గిరిజన తాలుకా నూతన కార్యవర్గాన్ని సన్మానించిన గిరిజన సంఘం నాయకులు

అచ్చంపేట టౌన్, ఫిబ్రవరి 11 : గిరిజన ఉద్యోగ, యువజన సంఘం అచ్చంపేట నియోజకవర్గ కమిటీని ఆదివారం పట్టణంలోని గిరిజన భవనంలో ఎన్నుకున్నారు. గిరిజన ఉద్యోగ సేవా సంఘం అధ్యక్షుడిగా శంకర్‌రాథోడ్, ఉద్యోగ ప్రధాన కార్యదర్శిగా రాజగోపాల్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా యువజన సేవా సంఘం అధ్యక్షునిగా లచ్చునాయక్, ప్రధాన కార్యదర్శిగా దగ్గునాయక్, కార్యనిర్వహణ అధ్యక్షుడిగా శత్రునాయక్, కోశాధికారిగా నాగనాయక్, ఉపాధ్యక్షుడిగా శంకర్‌నాయక్, సంయుక్త కార్యదర్శిగా రమేష్‌నాయక్, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నుకున్న కార్యవర్గాన్ని గిరిజన నాయకులు సన్మానించారు.

మోడ్రన్ మార్కెట్ నిర్మాణానికి

మోక్షమెన్నడో

» నిధులు మంజూరైనా ముందుకు సాగని నిర్మాణం
» ఐదేళ్లుగా ఎదురుచూపులు
» ఇబ్బందులు పడుతున్న రైతులు



కొల్లాపూర్ ప్రధాన రహదారులపై కూరగాయలు విక్రయిస్తున్న రైతులు



రోజువారీ మార్కెట్‌ను కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రంలో ప్రారంభించాలని రైతులు, కొనుగోలుదారులు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

కొల్లాపూర్, ఫిబ్రవరి 11 : కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రంలో ఉన్న మండలాలు, గ్రామాల పరిధిలోని రైతులు తాము పండించిన కూరగాయలను విక్రయించుకునేందుకు మోడ్రన్ మార్కెట్ ఏర్పాటు చేయాలని కోరగా 2018లో అప్పటి మంత్రి జూపల్లి కృష్ణారావు కోటి రూపాయల నిధులు మంజూరు చేస్తూ శిలాఫలకాన్ని కూడా ప్రారంభించారు. ఐదేళ్లు గడిచినా మోడ్రన్ మార్కెట్ నిర్మాణానికి మోక్షం కలుగలేదు. కొల్లాపూర్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వెనక ఖాళీ ప్రదేశంలో రైతులకు అనువుగా అన్ని వసతులతో కూడిన మోడ్రన్ మార్కెట్ నిర్మాణం చేపట్టాలని అప్పట్లో మంత్రి జూపల్లి ఆదేశించారు. కొద్దిరోజుల క్రితం మునిసిపల్ ప్రజాప్రతినిధులు పట్టణంలోని ఆర్డీవో కార్యాలయ ఆవరణలో మోడ్రన్ మార్కెట్ ఏర్పాటు చేయాలని స్థల పరిశీలన సైతం చేశారు. అయితే పనులు మాత్రం ప్రారంభించలేదు. దీంతో చేసేదేమీ లేక రైతులు తాము పండించిన కూరగాయలను ప్రతీ ఆదివారం పట్టణంలోని ప్రధాన రహదారులపై పెట్టుకుని విక్రయించుకునే పరిస్థితి నెలకొంది. రోజువారీగా కూరగాయలు విక్రయించుకునే రైతులు ప్రధాన రోడ్లకిరువైపులా కూర్చొని తమ పంటలను విక్రయిస్తున్నారు. ఇప్పటికైనా అన్ని వసతులతో కూడిన మోడ్రన్ మార్కెట్ ఏర్పాటు చేయాలని,

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



మన్ననూరు సాంఘిక సంక్షేమ గురుకులం వద్ద సందడి వాతావరణం

లింగాల, ఫిబ్రవరి 11 : సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఐదవ తరగతిలో ప్రవేశం కోసం ఆదివారం నిర్వహించిన అర్హత పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో 456 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 24 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ బాలస్వామి తెలిపారు. తహసీల్దార్ ఉమ, ఎస్సై జగన్‌మోహన్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు.

● మన్ననూర్ : అమ్రాబాద్ మండలంలోని మన్ననూరు సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయం, పీటీజీ గురుకుల విద్యాలయాల్లో ఆదివారం జరిగిన ఐదో తరగతి గురుకుల ఉమ్మడి ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ శ్రీకాంత్ తనిఖీ చేశారు. సాంఘిక సంక్షేమ గురుకులంలో 384 మందికి గాను 355 మంది, పీటీజీలో 384 మందికి గాను 366 మంది విద్యార్థులు హాజరైనట్లు పరీక్ష కేంద్రాల ప్రిన్సిపాళ్లు రూపాదేవి, పద్మావతిలు తెలిపారు. విద్యార్థులు, వెంట వచ్చిన తల్లిదండ్రులు, బంధువులతో పరీక్షా కేంద్రాల వద్ద సందడి వాతావరణం కన్పించింది. పరీక్ష కారణంగా మన్ననూరులోని చిరు దుకాణాలు, హోటళ్ల నిర్వాహకుల వ్యాపారం బాగా సాగింది.

గురుకులాల్లో జరుగుతున్న సంఘటనలు

పునరావృతం కాకుండా చూసుకోవాలి

» బీఎస్పీ నాగర్‌కర్నూల్ మహిళా కన్వీనర్ సృజన



బీఎస్పీ నాయకుల అత్యవసర సమావేశంలో మాట్లాడుతున్న సృజన

తెలకపల్లి, ఫిబ్రవరి 11 : గురుకులాల్లో జరుగుతున్న విద్యార్థుల విషాద సంఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని బీఎస్పీ నాగర్‌కర్నూల్ మహిళా కన్వీనర్ సృజన అన్నారు. మండల కేంద్రంలోని యోగా బిల్డింగ్ వద్ద ఆదివారం బీఎస్పీ మండల నాయకులు అత్యవసర సమావేశం నిర్వహించారు. సమావేశానికి సృజన హాజరై మాట్లాడారు. భువనగిరిలో జరిగిన భవ్య వైష్ణవిల మరణ సంఘటన మనసుని కలిచి వేసిందని, గత ప్రభుత్వం ఉన్నప్పుడు ఇలాంటి సంఘటనలే జరిగాయని, ఇప్పుడు కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ ఇలాంటి ఘటనలే జరగడం దారుణమన్నారు. మహిళల సాధికారతే మా లక్ష్యమని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ఎందుకు మౌనం పాటిస్తోందని ప్రశ్నించారు. అధికారం మీద ఉన్న సోయి మహిళల భద్రత మీద లేదని మండిపడ్డారు. తక్షణమే ఈ ఘటనను విచారించి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఎస్పీ నాగర్‌కర్నూల్ అసెంబ్లీ అధ్యక్షుడు మహేష్‌యాదవ్, ఉపాధ్యక్షుడు కల్యాణ్, మండల అధ్యక్షుడు ఆర్‌కే.శివశంకర్, ప్రధాన కార్యదర్శి బాలనాగయ్య, మొగులాల్, రాజేష్, రామస్వామి, శివుడు తదితరులు పాల్గొన్నారు.

పాలెం వాసికి డాక్టరేట్



చెన్నైలోని గ్లోబల్ హుమన్ పీస్ యూనివర్సిటీ వీసీ చేతులమీదుగా డాక్టరేట్ పట్టా అందుకుంటున్న ప్రతాప్‌కౌటిళ్య

బిజినేపల్లి, ఫిబ్రవరి 11 : సైన్స్‌లో చేసిన విశిష్ట సేవలను గుర్తించి తమిళనాడు రాజధాని చెన్నైలోని గ్లోబల్ హుమన్ పీస్ యూనివర్సిటీ వారు తనకు డాక్టరేట్‌ను అందించినట్లు పట్టా పొందిన ప్రతాప్‌కౌటిళ్య ఆదివారం తెలిపారు. బిజినేపల్లి మండలం పాలెం గ్రామానికి చెందిన ప్రతాప్‌కౌటిళ్య ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఎస్సీ బయో కెమిస్ట్రీ పూర్తిచేసి పాతిక సంవత్సరాల పాటు జీవ రసాయన శాస్త్ర ఉపన్యాసకులుగా సైన్స్ పాఠాలు బోధించారు. డాక్టరేట్ పట్టా అందుకున్న ప్రతాప్‌కౌటిళ్యను జాతీయ పోషకాహార సంస్థ డైరెక్టర్ డాక్టర్ భానుప్రకాష్‌రెడ్డి, సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ శేషూరి నరేష్ బాబు, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజేందర్‌సింగ్, నెలపొడుపు సాహితీ సాంస్కృతిక సంస్థ, వెన్నెల సాహిత్య అకాడమీ అధ్యక్ష, కార్యదర్శులు వనపట్ల సుబ్బయ్య, ముచ్చర్ల దినకర్, కందికొండ మోహన్, వహీద్‌ఖాన్, మద్దిలేటి, ఎదిరేపల్లి కాశన్న, కపిలవాయి ఆనంద్, సోమశిల సురేష్‌బాబు, సినీ రచయిత హెచ్.రమేష్‌బాబు, ప్రిన్సిపాల్ విద్యారాణి తదితరులు అభినందించారు.

చెకుముకి సైన్స్ సంబురాల్లో

కొల్లాపూర్ విద్యార్థుల ప్రతిభ



చెకుముకి సైన్స్ సంబురాల్లో ప్రశంసాపత్రాలు అందుకుంటున్న స్కాలర్స్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

కొల్లాపూర్, ఫిబ్రవరి 11 : రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ సంబురాల్లో కొల్లాపూర్ పట్టణ స్కాలర్స్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఇటీవలే కొల్లాపూర్ మండల, జిల్లా స్థాయి ఇంగ్లిష్ మీడియం విభాగంలో చెకుముకి పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికైన స్కాలర్స్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జి.పృథ్వీరాజ్ పదవ తరగతి, కే.మేఘన తొమ్మిదవ తరగతి, జి.రుత్విక్‌సాగర్ ఎనిమిదవ తరగతి విద్యార్థులు ఈనెల 9, 10, 11 తేదీల్లో జనగామ జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి చెకుముకి పోటీల్లో పాల్గొని, ప్రతిభ కనబర్చారు. విద్యార్థులకు ఏఆర్‌సీఐ డైరెక్టర్ టాటా నర్సింగరావు ప్రశంసా పత్రాలను అందజేశారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కరస్పాండెంట్ ఎ.రాముయాదవ్, ప్రిన్సిపాల్ రవికుమార్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు అభినందించారు.

జ్ఞాన సరస్వతీ దేవాలయంలో గోపద్మవ్రతం

కందనూలు, ఫిబ్రవరి 11 : మాఘమాసంలో గోపద్మ వ్రతం చేస్తే జన్మరీత్యా గ్రహదోష పరిహారం చెంది, పూజించిన వారికి అష్టైశ్వర్యాలు, భోగభాగ్యాలు సిద్ధిస్తాయని జ్ఞాన సరస్వతీ దేవాలయం ప్రధాన అర్చకుడు నవీన్‌కుమార్ అన్నారు. కొల్లాపూర్ చౌరస్తా సమీపంలోని జ్ఞాన సరస్వతీ దేవాలయం బ్రహ్మోత్సవ కార్యక్రమంలో భాగంగా రెండోరోజు ఆదివారం దేవాలయంలో నవగ్రహ హోమాన్ని వేదపండితులు పవన్‌కుమార్ వేదమంత్రోచ్చరణల మధ్య నిర్వహించారు. సామూహిక గోపద్మవ్రతంలో 81మంది మహిళలు పాల్గొని గోపూజ నిర్వహించారు. అనంతరం అమ్మవారికి అష్టోత్తర కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ నిత్య అన్నదాన సత్రంలో భక్తులు సామూహిక భోజనాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆకారపు విశ్వనాథం, కార్యదర్శి ఎలిమే ఈశ్వరయ్య, శివశంకర్, ఇందుమతి, దొడ్ల నారాయణరెడ్డి, వరలక్ష్మీ, పాండురంగయ్య వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళా భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం

కల్వకుర్తి, ఫిబ్రవరి 11 : కల్వకుర్తి పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో వాసవిమాత ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ జూలూరి రమేష్‌బాబు దంపతులు ప్రత్యేక హోమాలు నిర్వహించారు. అమ్మవారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని పూజలు నిర్వహించారు. జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి కలిమిచెర్ల రమేష్, కోశాధికారి శివ, జగదీశ్వర్, అదనపు ప్రధాన కార్యదర్శి చిగుళ్లపల్లి శ్రీధర్, ప్రచార కార్యదర్శి మిర్యాల రాజయ్య, వాసశేఖర్, ఉప్పు ఆంజనేయులు, సురేష్, తలకొండపల్లి పీఏసీఎస్ చైర్మన్ రవికుమార్, వాసవిక్లబ్ అధ్యక్షుడు శ్రీనివాస్, కోశాధికారి అశోక్, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

● మన్ననూర్ : కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మన్ననూరులో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కన్యకాపరమేశ్వరి అష్టోత్తర శతనామావళి పఠనం చేశారు. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర రీజినల్ చైర్మన్ జూలూరి సత్యనారాయణ, ఏసీ మెంబర్ సంబు వెంకట్‌రమణ, ఆర్యవైశ్య సంఘం నాయకులు బిల్లకంటి రమేష్, భాస్కర్, శోభ, పద్మజ పాల్గొన్నారు.

దివ్యాంగులకు వీల్‌చైర్లు పంపిణీ

చారకొండ, ఫిబ్రవరి 11 : మండల పరిధిలోని జూపల్లిలో ఆదివారం సత్యహరిశ్చంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు వీల్‌చైర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ రాములుయాదవ్ మాట్లాడుతూ జూపల్లి గ్రామానికి చెందిన నూకం నారాయణ, ఎన్.కృష్ణమ్మలకు ఉచితంగా వీల్‌చైర్లు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యక్రమంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు డి.శ్రీరాములు, ఎండి.ఖాజా, లక్ష్మయ్య, కాశ్లరవి, సత్యనారాయణ, అల్లాజీ, పెద్దయ్య, వెంకటయ్య సత్తారి వెంకటయ్య, ఎండి.బాబా తదితరులున్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

» ఎస్సై సతీష్

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 11 : వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పెద్దకొత్తపల్లి ఎస్సై సతీష్ హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని, మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని శిక్షిస్తామన్నారు. తనిఖీ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గృహజ్యోతి పథకాన్ని వినియోగించుకోవాలి

కోడేరు, ఫిబ్రవరి 11 : గృహజ్యోతి పథకాన్ని వినియోగించుకోవాలని లైన్‌మెన్ ప్రభాకర్ కోరారు. ఆదివారం ఆయన ఇంటింటికి తిరిగి వినియోగదారుల సమాచారాన్ని సేకరించారు. కరెంటు మీటరు నెంబరు, ఆధార్‌కార్డు, ప్రజాపాలనలో దరఖాస్తు చేసిన రశీదు, ఫోన్ నెంబరును విద్యుత్ అధికారులకు చూపించి గృహజ్యోతి పథకాన్ని వినియోగించుకోవాలని కోరారు.

అన్నివర్గాలకు మేలు చేసే బడ్జెట్

» కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌నాయక్

ఊర్కొండ, ఫిబ్రవరి 11 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్నివర్గాల ప్రజలకు మేలు జరిగే విధంగా ఉందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌నాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి, బడ్జెట్‌పై మాట్లాడారు. ఆరు గ్యారెంటీలను కచ్చితంగా అమలుచేసే విధంగా బడ్జెట్ ఉందని, అదేవిధంగా రైతాంగానికి పెద్దపీట వేశారని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే పేదల ప్రభుత్వమని, పేద ప్రజలకు, మహిళలకు, అన్నివర్గాల ప్రజలు మెచ్చే విధంగా బడ్జెట్ ఉందని పేర్కొన్నారు.

కోట మైసమ్మ దేవాలయ నిర్మాణానికి భూమిపూజ

ఐతోల్(తాడూరు), ఫిబ్రవరి 11 : మండలంలోని ఐతోల్ గ్రామంలో పురాతన గండి కోట మైసమ్మ నూతన దేవాలయానికి ఆదివారం గ్రామ మాజీ సర్పంచ్ ఇందుమతి, నరసింహారెడ్డి దంపతుల చేతులమీదుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఇదివరకు ఉన్న పురాతన ఆలయ ప్రాంతంలోనే నూతన ఆలయాన్ని నిర్మించేందుకు గ్రామస్థులు అందరి సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్థులు బాల్‌రెడ్డి, శేఖర్, అశోక్, రాఘవేందర్‌రెడ్డి, భీంరెడ్డి, శివాజీ, హరీష్‌శర్మ తదితరులున్నారు.

రాయవరంలో ముఖద్వార నిర్మాణానికి..

లింగాల, ఫిబ్రవరి 11 : మండల పరిధిలోని రాయవరంలో గ్రామ ముఖద్వార నిర్మాణానికి ఆదివారం భూమి పూజ నిర్వహించారు. ఎరుకలి ఎల్లమ్మ, నర్సింహ్మా జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు ఉల్లగొండ సునిత, రాజు రూ.10 లక్షల ఖర్చుతో ముఖద్వార నిర్మాణాన్ని చేపట్టారు. గ్రామాభివృద్ధిలో దాతలు భాగస్వాములు కావడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

భూసార పరీక్షలపై రైతులకు అవగాహన

తెలకపల్లి, ఫిబ్రవరి 11 : మండల పరిధిలోని పర్వతాపూర్ గ్రామంలో కేవీకే పాలెం రావేఫ్ విద్యార్థులు ఆదివారం భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు భూసార పరీక్షలపై ప్రదర్శన నిర్వహించి, పరీక్ష యొక్క ప్రాధాన్యత, మట్టి నమూనాలను సేకరించే విధానాన్ని రైతులకు వివరించారు. కార్యక్రమంలో రావేఫ్ విద్యార్థులు ద్వారకమయి, విశ్వతేజ, అనూజ, శ్వేత, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

వరిలో కాండం తొలుచు పురుగు నివారణపై..

బిజినేపల్లి, ఫిబ్రవరి 11 : యాసంగిలో సాగు చేసిన వరి పంటకు ఎక్కువగా ఆశిస్తున్న కాండం తొలుచు పురుగు నివారణ చేపడితేనే అధిక దిగుబడి పొందవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, పాలెం కళాశాల రావేఫ్ విద్యార్థినులు అన్నారు. మండలంలోని మంగనూర్‌లో సోమవారం వరిలో కాండం తొలుచు పురుగు నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. వరిలో ఉత్పత్తిని తగ్గించే తెగుళ్లలో ప్రధానమైన కాండం తొలుచు పురుగు ఎండుగడ్డి రంగులో ఉన్న రెక్కల పురుగు, అలాగే దాని గుడ్ల సముదాయం ఆధారంగా గుర్తించవచ్చని అన్నారు. దీని నివారణకు ఎకరానికి మూడు లేదా ఐదు లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేయాలని సూచించారు. రావేఫ్ విద్యార్థినులు నిహారిక, ప్రణయ, వైష్ణవి, వైష్ణవిరెడ్డి, నివేదిత తదితరులున్నారు.

నేడు వ్యవసాయ పనిముట్ల ప్రదర్శన

ఉప్పునుంతల, ఫిబ్రవరి 11 : కృషి విజ్ఞాన కేంద్రం పాలెం ఆవరణలో సోమవారం ఉదయం 10 గంటలకు వ్యవసాయ పనిముట్లు మరియు యంత్రాలపై అఖిల భారత సమన్వయ పరిశోధన సంస్థ, హైదరాబాద్ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించనున్నామని కొరటికల్ ఏఈవో భరత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల రైతులు మేళాలో పాల్గొనాలని ఆయన కోరారు.

15, 16 తేదీల్లో కబడ్డీ, వాలీబాల్ పోటీలు

కోడేరు, ఫిబ్రవరి 11 : సంతుసేవాలాల్ మహారాజ్ 285వ జయంతి, మహా బోగ్‌బండార్ సందర్భంగా ఈనెల 15, 16వ తేదీల్లో నియోజకవర్గ స్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు గిరిజన నాయకుడు, ఆర్గనైజర్ వాల్యానాయక్ తండా హనుమంతునాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొల్లాపూర్ పరిధిలోని అన్ని గిరిజన తండాల క్రీడాకారులు కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో పాల్గొనడానికి ఆయా తండాల్లోని నాయకుల దగ్గర పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. కొల్లాపూర్ మండల కేంద్రంలోని గిరిజన భవన్ వద్ద క్రీడా పోటీలు నిర్వహించనున్నామని, గిరిజన క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన

వంగూరు, ఫిబ్రవరి 11 : మండలంలోని కోనేటిపూర్‌లో శనివారం రాత్రి నిర్వహించిన రేణుక ఎల్లమ్మ కోలాట ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. గ్రామ పెద్దల సహకారంతో 45 రోజుల పాటు 32 మంది మహిళలు కోలాటం నేర్చుకున్నారు. కాళ్లకు గజ్జెలు కట్టుకొని అందరు ఒకే డ్రస్‌కోడ్‌తో కోలాటం వేస్తు ఆడిపాడారు. అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు హాజరై, కోలాట ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలు తీశారు. కోలాట కళాకారుల బృందానికి బహుమతులను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పులిజాల కృష్ణారెడ్డి, కోట్లనరేందర్‌రావు, గణేష్‌రావు, దొడ్డి సైదులు, ప్రశాంత్ రావు, ఆంకూరి అంజి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

కల్వకుర్తి, ఫిబ్రవరి 11 : క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని జిల్లా యువజన క్రీడల అధికారి సీతారామ్‌నాయక్, కబడ్డీ జిల్లా అసోసియేషన్ కార్యదర్శి యాదయ్యగౌడ్‌లు అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం జిల్లా సబ్ జూనియర్ బాలికల ఎంపిక జరిగింది. ఎంపికకు జిల్లాలోని 135మంది క్రీడాకారులు హాజరు కాగా 24మంది క్రీడాకారులు ఎంపికయ్యారని యాదయ్యగౌడ్ పేర్కొన్నారు. సూర్యాపేటలో ఫిబ్రవరి 16 నుంచి 19వరకు జరిగే రాష్ట్ర స్థాయి 33వ తెలంగాణ కబడ్డీ చాంపియన్‌షిప్‌లో ఎంపికైన క్రీడాకారులు పాల్గొంటారని వారు తెలిపారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లుగౌడ్, సదానందంగౌడ్, శ్రీనివాసులు, హేమంత్‌కుమార్, ప్రకాశ్, మోహన్‌లాల్, రామన్‌గౌడ్, భారతి, సునీత, విజయ్ కుమార్ తదితరులున్నారు.



క్రీడలను ప్రారంభిస్తున్న నాయకులు

మండల స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

లింగాల, ఫిబ్రవరి 11 : సేవాలాల్ జయంతి సందర్భంగా బంజార కింగ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో మండల స్థాయి టెన్నిస్ బాల్, క్రికెట్ పోటీలను ప్రారంభించారు. పోటీల్లో మొత్తం 16 జట్లు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ.20,116, రెండవ బహుమతి రూ.10,116 నగదు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గిరిజన ఉద్యోగ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు శంకర్‌రాథోడ్, రాజు, బాలాజీ, శంకర్, దేవేందర్, కిషన్, రఘుపతి, రాందాస్, కిషన్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.